క్లుప్తంగా

10 నుంచి నున్నలో క్రికెట్ పోటీలు

విజయవాడరూరల్: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నున్న గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో క్రికెట్ పోటీలు జరుగుతాయని పీడీ టీవీ రమణ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పోటీలకు ఒక్కో సచివాలయం నుంచి ఒక టీము చొప్పున 21 క్రికెట్ టీములు పాల్గొంటాయని పేర్కొన్నారు. మొత్తం 20 మ్యాచ్‌లు జరుగుతాయని ఆయన తెలియజేశారు. రెండవ దఫా క్రికెట్ పోటీలు 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు క్రికెట్ పోటీలు జరుగుతాయని 20వ తేదీన ఫైనల్ పోటీలు జరుగుతాయన్నారు.

ఎస్సార్కేలో ఉచిత ఉపాధి నైపుణ్య శిక్షణ ఒప్పందం



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల, సీఎస్‌సీ అకాడమీల మధ్య శనివారం పరస్పర ఉపాధి నైపుణ్య శిక్షణ అవగాహన ఒప్పందం జరిగింది. సీఎస్‌సీ అకాడమీ సలహాదారు వై.రామ్మోహనరావు, ఎస్సార్కే కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు ఒకరికొకరు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. సీడాక్, ఐఈఈఈ ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఈ నూతన సాంకేతికతపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులకు ఎన్ఐఈఎల్ఐటీ ద్వారా 3డీ ప్రింటింగ్, రోబోటిక్ ప్రాసెసింగ్‌పై వాధ్వాని ఫౌండేషన్ ద్వారా ఉపాధి నైపుణ్యాలు, పారిశ్రామిక వ్యవస్థాపకత శిక్షణ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంతర్గత నాణ్యత హామీ విభాగాధిపతి శ్రీ గౌరి, ఎస్సీ,ఎస్టీ సెల్ ఇన్‌చార్జి ఎ.స్టాన్లీ కుమార్ పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ



కంకిపాడు: పేదలకు అండగా నిలవాలని లయన్స్ ప్రతినిధులు సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యంలో గొల్లగూడెం గ్రామంలో 40 మంది పేదలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. దాత జి.శ్రీలక్ష్మి, లయన్స్ ప్రతినిధులు కేఎస్ మల్లేశ్వరరావు, ఎం.గోవిందరావు, పి.విల్సన్, హైదరాబాద్ కార్పొరేటర్ జి.దేదీప్య, డాక్టర్ జి.ప్రతిభ పాల్గొన్నారు.

గొల్లనపల్లిలో కళ్లజోళ్లు పంపిణీ

గన్నవరంరూరల్: మండలంలోని గొల్లనపల్లిలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా కంటి పరీక్షలు చేయించుకున్న లబ్ధిదారులకు శనివారం ప్రభుత్వం మంజూరు చేసిన కళ్లజోళ్లను వైద్య సిబ్బంది అందజేశారు. పంచాయతీ కార్యదర్శి మారుతీ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు నిరంతరం వైద్య సిబ్బంది ఆరోగ్య సేవలు అందించటంతో పాటు కొత్తగా మంజూరైన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులు అందజేస్తున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25లక్షల వరకూ వైద్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని వివరించారు.

మేనేజ్‌మెంట్ కోర్సు విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

పెనమలూరు: మేనేజ్‌మెంట్ కోర్సులు చదివే విద్యార్థులకు అపారమైన ఉద్యోగావకాశాలు ఉంటాయని మిజోరం కేంద్రీయ విద్యాలయం ప్రొఫెసర్ ఎస్‌వీఆర్ జ్యోతికుమార్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో పరిపాలనలో మేనేజర్ పాత్ర అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా విభిన్న పరిస్థితుల్లో వివిధ సంస్థల్లో మేనేజర్‌లు విభిన్నపాత్రలు పోషించాల్సి వస్తుందన్నారు. పాలనలో సరైన నిర్ణయాలు తీసుకునే విషయంలో నైపుణ్యం ప్రదర్శించాలని తెలిపారు.ప్రపంచ వ్యాప్తంగా మేనేజ్‌మెంట్ చదివే విద్యార్థులకు మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వారి విశ్వాసమే వారిని ముందుకు నడిపిస్తుంది



ఉంగుటూరు: క్రీస్తు నందు విశ్వాసం ఉంచువారికి వారి విశ్వాసమే వారిని ముందుకు నడిపిస్తుందని పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ విజయరాజు భావన అన్నారు. పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి వర్ధంతి మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలు శనివారం ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక దివ్య పూజాబలిని సమర్పించారు. ఫాదర్ విజయరాజు మాట్లాడుతూ బ్రదర్ జోసఫ్ తంబి ఎందరో వ్యాధిగ్రస్తులను స్వస్థత పరిచారని తెలిపారు. అనంతరం ప్రత్యేకంగా వ్యాధిగ్రస్తుల కోసం ప్రార్థన చేశారు. కార్యక్రమాలను ఏర్పాటు చేసిన వారికి పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్ కృతజ్ఞతలు తెలిపారు.ప్రార్థనల్లో ఫాదర్లు ప్రవీణ్, అభిలాష్ గోప్పు, కిషోర్ కచ్చ, రవి మద్దాల పాల్గొన్నారు.

అభివృద్ధికి అన్ని వేళలా సహకరిస్తా



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: అభివృద్ధికి అన్నివేళలా సహకరిస్తానని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడులో పాశం లక్ష్మణ స్వామి నగర్ ప్రాంతంలో రూ.20.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన 11 సిమెంటు రోడ్లను ఎమ్మెల్యే పార్థసారథి శనివారం రాత్రి ప్రారంభించారు. అనంతరం లాకు రోడ్డులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. నియోజకవర్గంలో ప్రాధాన్యతా క్రమంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ఇప్పటికే పూర్తి చేశామని వివరించారు. మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలని కోరారు. తాను ఎల్లప్పుడూ ప్రజలకు అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, సర్పంచ్ బాకీ రమణ, జేసీఎస్ మండల చైర్మన్ రాచూరి చిరంజీవి, వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్, సీహెచ్‌సీ చైర్మన్ మేడంద్రావు కుటుంబరావు, అగ్రికల్చర్ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాదు వసంతరావు, డైరెక్టర్ తాళ్లూరి మరియబాబు, అగ్రి బోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నిదానం రంగారావు, అంకారావు, బాకీ చంటి, వెంకాయమ్మ, సీతారామయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

ఉయ్యూరు: పేదల పండుగ ఎమ్మెల్యే పార్థసారథి నిలుస్తున్నారని నేతలు స్పష్టం చేశారు. వీరు పట్టణంలోని ఐదో వార్డులో ఇటీవల మరణించిన కొడాలి ఆనందరావు కుటుంబానికి పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు కొలుసు పార్థసారథి రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు.
కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దిరిశం జ్యోతిర్మయి, మట్టా జగన్, ఈడ్పుగంటి డేవిడ్ రాజు, ఉయ్యూరు సుధాకర్, మట్టా హనోక్, కలకట్ల చంద్రమౌళి, నందేటి ప్రవీణ్, వల్లూరు రవీంద్ర, తుమ్మపూడి సతీష్, ఈడ్పుగంటి రాజా పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



గురుకుల పాఠశాల ఎదుట రంగవల్లులు, గొబ్బెమ్మలతో విద్యార్థినులు

గురుకులంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

గన్నవరంరూరల్ తెలుగింటి సంప్రదాయ వస్త్రధారణలు, హరిదాసుల సంకీర్తనలు, పల్లె పట్టు పరికిణీలతో విద్యార్థులు అలరించారు. మండలంలోని వీరపనేనిగూడెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగవల్లులు, గొబ్బెమ్మలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ వై.యశోద లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ సుమిత్రాదేవి మాట్లాడుతూ తెలుగు సంప్రదాయానికి ప్రతీకలుగా ఉన్న విద్యార్థినులను అభినందించారు. ఆత్కూరు పీహెచ్‌సీ డాక్టర్ మనోహర్‌రెడ్డి, వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జి.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.



నలంద ప్రాంగణంలో భోగిమంటలతో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు

నలందలో భోగిమంటలతో సంక్రాంతి సంబరాలు

కంకిపాడు: ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్ వసంత క్యాంపస్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో పల్లెటూరి వాతావరణంలో ముచ్చటైన పూరిల్లు, భోగి మంటలు, హరిదాసు కథా కాలక్షేపం అలరించాయి. చిన్నారులకు భోగిపండ్లు పోసి పెద్దలు ఆశీర్వాదం అందించారు. సంబరాలను పెనమలూరు ఎంఈఓ కనకమహాలక్ష్మి, విద్యాసంస్థల సీఏసీ ఎల్.సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు రంగవల్లులు, సంప్రదాయ వస్త్రాలంకరణ, ఆంధ్రా వంటకాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమాలను పాఠశాల ప్రిన్సిపాల్ జె.పద్మావతి పర్యవేక్షించారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనగాని రవి

గన్నవరం: ఈ నెల 10వ తేదీ నుంచి మండల స్థాయిలో జరగనున్న ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ అనగాని రవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల స్థాయి పోటీలను ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో పండుగ వాతావరణంలో నిర్వహించాలని చెప్పారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ప్రతిరోజు భోజన సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. ఐదు క్రీడా విభాగాల్లో విజేతలుగా నిలిచిన జట్లకు, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు చెప్పారు. పోటీలు జరిగే ప్రాంగణాలను ఆడుదాం ఆంధ్రా బ్యానర్లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. పోటీల నిర్వహణలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాయామోపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు భాగస్వాములు కావాలని కోరారు. ఎంపీడీవో సత్యకుమార్ మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో, బ్యాడ్మింటన్ కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో, క్రికెట్ ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులకు అందజేయనున్న టీషర్ట్‌లను ఆవిష్కరించారు. ఎంఈఓ కె.రవికుమార్, ఈవోపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, క్రీడా సమన్వయకర్త డి.నాగరాజు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మోసగాడు

పెనమలూరు: యనమలకుదురులో లబ్ధిదారులను మోసం చేసి పరారీలో ఉన్న నిందితుడిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటన వివరాల్లోకి వెళితే యనమలకుదురు గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం వణుకూరులో ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. వణుకూరులో ఉండే ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ల సూచనలతో పెదపులిపాకకు చెందిన కాంట్రాక్టర్ వీరకృష్ణ(విజయకృష్ణ) కు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేయటానికి సొమ్ము, ప్రభుత్వం ఇచ్చిన భవన నిర్మాణ మెటీరియల్ ఇచ్చారు. దాదాపు 20 మందికి పైగా రూ.20 లక్షల మేర సొమ్ము అడ్వాన్స్‌గా వీరకృష్ణకు ఇచ్చారు. అయితే నెలలు గడుస్తున్నా వీరకృష్ణ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం చేపట్టకపోగా, లబ్ధిదారులకు కనిపించకుండా పరారయ్యాడు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న వీరకృష్ణ కోసం పోలీసులు గాలించగా ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితుడు పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాడన్న సమాచారంతో శనివారం లబ్ధిదారులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సీఐ రామారావును కలిసి న్యాయం చేయమని కోరారు.

బోర్లు, పైప్‌లైన్ల ఏర్పాటుకు తీర్మానం



పరిమి రమేష్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సర్పంచ్ శీలం రంగారావు, పాలకవర్గ సభ్యులు

రామవరప్పాడు: తాగునీటి ఎద్దడిని నివారించేందుకు గ్రామంలో నూతన బోర్లు, పైప్‌లైన్ల విస్తరణకు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు పంచాయతీ కార్యాలయంలో శనివారం సాధారణ సమావేశాన్ని సర్పంచ్ శీలం రంగారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలోని పలు అంశాలను పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ పాలకవర్గ సభ్యులకు వివరించారు. గతంలో ప్రతిపాదనలు పెట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు తీర్మానించారు. గ్రామంలో గ్రావెల్ రహదారులు, అసంపూర్తిగా ఉన్న రహదారులకు మరమ్మతులు నిర్వహించే విషయంపై చర్చించి ఆమోదించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన కాంట్రాక్ట్ సిబ్బందిని టెండర్ల ద్వారా నియామకం అంశంపై పాలకవర్గ సభ్యులు తీర్మానించారు.

రమేష్ మృతికి నివాళి

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ పరిమి రమేష్ చిత్రపటానికి సర్పంచ్ శీలం రంగారావుతో పాటు పాలకవర్గ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రమేష్ 2001 నుంచి 2006 వరకు సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. సొసైటీ చైర్మన్‌గా కూడా పనిచేసి ప్రజల మన్ననలు పొందారన్నారు.

సంక్రాంతి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు



జాతీయ రహదారిపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ, సీఐ, ఎస్ఐ, ఆలయ అధికారులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు పేరంటాలమ్మ ఆలయంలో నిర్వహించే సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని ఏసీపీ భాస్కర్ అన్నారు. సంక్రాంతి సంబరాల నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పోలీస్ అవుట్ పోస్టు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై శనివారం ఆలయ ఈఓ లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్, సర్పంచ్ వరి శ్రీదేవితో పోలీసు అధికారులు చర్చించారు. అనంతరం జాతీయ రహదారిపై వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరించే విధానాలపై పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు, భక్తులు సహకారం అందించాలని కోరారు. ఆలయం సమీపంలో పోలీస్ అవుట్‌పోస్టును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అల్లరిమూకలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పోలీసులు ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తారని తెలిపారు. అనంతరం ఏసీపీ భాస్కర్, ట్రాఫిక్ ఏసీపీ సురేష్, సీఐ కాశీ విశ్వనాథ్ పేరంటాలమ్మను, రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

సంపూర్ణ వ్యక్తిత్వం కలవారిగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఉషారామాలో యువజనోత్సవాలు



తెలుగమ్మాయి విజేతలతో చైర్మన్ రాంబ్రహ్మం

ఉంగుటూరు: విద్యార్థులను సంపూర్ణ వ్యక్తిత్వం కలవారిగా తీర్చిదిద్దేందుకు యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం తెలిపారు. ఉంగుటూరు మండలం తేలప్రోలులో ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల యూత్ ఫెస్ట్-2024 శనివారం ఘనంగా ముగిశాయి. అమ్మాయిల చలాకీతనం, సమయస్ఫూర్తి, తెలుగు సంస్కృతి పట్ల అవగాహన పరీక్ష చేయడానికి ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలుగమ్మాయి పోటీలలో వివిధ కళాశాలల నుంచి 80మంది విద్యార్థినులు పాల్గొన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ సూపరింటెండెంట్ శమంతకమణి, నయాన ఫ్యాషన్ టెక్నాలజీ సీఈవో(విజయవాడ) సమాన హుస్సాని జడ్జిలుగా వ్యవహరించారు. తెలుగమ్మాయి పోటీలలో జి.భవాని మొదటి బహుమతి గెలుపొందగా జి.జయశ్రీ ద్వితీయ, కె.మెర్సీ తృతీయ బహుమతులను సాధించారు. డ్యాన్స్, మిస్టర్ పర్‌ఫెక్ట్, స్పాట్ ఫొటోగ్రఫీ వంటి పోటీలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. అనంతరం కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్, డైరెక్టర్ కె.రాజశేఖర్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని వె.వర ప్రసాద్, నరేష్ సమన్వయం చేశారు.

మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ సునీతాశర్మ

పెనమలూరు: మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఈ నెల 10వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నామని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పోటీల్లో పాల్గొనే జట్లకు డ్రాలు తీసి వివరాలు వెల్లడించారు. మండల స్థాయిలో వాలీబాల్ 9 జట్లు, కబడ్డీ 10 జట్లు, క్రికెట్ 11 జట్లు, షటిల్ 11 జట్లు, ఖోఖో 11 జట్లు చొప్పున పోటీల్లో పాల్గొంటాయన్నారు. షటిల్ పోటీలు పెనమలూరు హైస్కూల్‌లో, క్రికెట్ పోటీలు గంగూరు ధనేకుల కాలేజీలో, మిగతా పోటీలు వణుకూరు హైస్కూల్‌లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో లోయ శివశంకర్‌రావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుదల, ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఎంపీపీ రవి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ షాహిన్‌బాబు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో శనివారం విజయం మీదే పేరుతో పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఎంపీపీ అనగాని రవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంబేడ్కర్ చిత్రపటానికి సోషల్ వెల్ఫేర్ డీడీ షాహిన్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదల, ప్రణాళికతో చదివితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. పదవ తరగతి చదువుతున్న వసతి గృహ విద్యార్థులకు గైడ్‌లు పంపిణీ చేయనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ షాహిన్‌బాబు తెలిపారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వార్డెన్లకు సూచించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు.